ప్రజాశక్తి

శనివారం 2 మార్చి 2024   8 పేజీలు

గుంటూరు   పల్నాడు

ఐదు చోట్ల తొలగని ప్రతిష్టంభన

- అభ్యర్థుల ఎంపికపై టిడిపిలో అయోమయం
- నేడు దాచేపల్లిలో చంద్రబాబు సభ
- పార్టీలో చేరనున్న శ్రీకృష్ణదేవరాయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. పెదకూరపాడు, గురజాల, నర్సరావుపేట, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక కొలిక్కిరాలేదు. ఇక్కడ ఉన్న ఇన్‌ఛార్జిలకు భరోసా ఇవ్వకపోవడంతో వారంతా అయోమయంలో ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో విశేషమేమంటే పార్టీలో చేరకముందే కొంతమంది నాయకుల పేర్లను ఫోన్ సర్వేల్లో ఆరా తీస్తున్నారు. గురజాల నుంచి ఎమ్మెల్సీ జంగాకృష్ణమూర్తి పేరును సర్వేల్లో చేర్చారు. ఆయన ఇంత వరకు వైసిపికి రాజీనామా చేయలేదు.. టిడిపిలో చేరలేదు.. చంద్రబాబును కలసి చర్చించనూ లేదు. ఆయన తరుపున ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మాత్రమే అభ్యర్థించారు. గురజాల ఇన్‌ఛార్జిగా ఉన్న యరపతినేని శ్రీనివాసరావు పేరును నర్సరావుపేట నియోజకవర్గానికి మార్పు చేస్తూ సర్వే చేశారు. సీనియర్ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, యరపతినేని శ్రీనివాసరావు, కొమ్మాలపాటి శ్రీధర్‌కు తొలి జాబితాలో చోటు దక్కలేదు. వీరికి ప్రాతినిధ్యం వుంటుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. పొత్తులో తెనాలిలో అవకాశం ఇవ్వకపోతే ఆలపాటికి ప్రత్యామ్నాయంగా మరొకచోట అవకాశం కల్పించే అంశంపై ఇంతవరకు స్పష్టత లేదు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురజాల నుంచిపోటీ చేసే అంశాన్ని శనివారం దాచేపల్లిలో జరిగే రా కదలిరా సభలో చంద్రబాబు ప్రస్తావిస్తారా లేదా విషయం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నర్సరావుపేట సిట్టింగ్ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు వైసిపికి రాజీనామా చేసి దాచేపల్లిలో చంద్రబాబు సమక్షంలో రా కదలిరా సభలో పార్టీలో చేరనున్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ జంగా కృష్ణమూర్తి టిడిపిలో చేరడం లేదు. సీటు ఖరారు కాకపోవడంతో జంగా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. జంగా దాచేపల్లి సభలో పాల్గొనకపోతే అనివార్యంగా యరపతినేని పేరును చంద్రబాబు ప్రకటిస్తారని టిడిపి వర్గాలు భావిస్తున్నాయి. ▶ 2లో

ఎన్నికల నోటిఫికేషన్ రాకమునుపే అగ్ని ప్రమాద బాధిత రైతులకు

నష్టపరిహారం ఇవ్వాలి

- రిలేదీక్షల ప్రారంభంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- అవసరమైతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్దకు తీసుకెళ్తామని హామీ
- మంత్రి, ఎంపీలు, కలెక్టర్‌ను కలిసినా స్పందన లేదని నాయకుల ఆగ్రహం
- రోడ్ల దిగ్బంధనానికీ వెనకాడబోమని హెచ్చరిక

దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి - దుగ్గిరాల

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం సంభవించి పసుపు పంటను నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన దుగ్గిరాలలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులు శుక్రవారం రిలేదీక్షలు చేపట్టారు. దీక్షలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. ▶ 2లో

గుంటూరులో పరీక్షకు వెళుతున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు గుంటూరు జిల్లాలో 97.5 శాతం, పల్నాడు జిల్లాలో 95.48 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడుజిల్లా

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 32,498 మంది హాజరు కావాల్సి ఉండగా, 31,718 (97.5 శాతం) మంది హాజరయ్యారు. 780 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 1078 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను 125 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు, మాల్‌ప్రాక్టీసులు కేసులు నమోదు కాలేదని ఆర్ఐఒ జి.కె.జుబేర్ తెలిపారు. గుంటూరులోని ఏసీ కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. అనంతరం ఇంటర్ ఆర్ఐఒ కార్యాలయంలో పరీక్షా కేంద్రాలతో అనుసంధానం చేసిన లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పలు కాలేజీల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పలు కేంద్రాలను సందర్శించాయి. ఎస్.ఆర్.కాలేజి, చైతన్య కాలేజీలను ఆర్ఐఒ పరిశీలించారు. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు పరీక్ష నిర్వహిస్తారు.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 48 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 15618 మంది విద్యార్థులు ▶ 2లో

నరసరావుపేటలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి శ్యాంప్రసాద్

నగదుతో పట్టుబడిన ఎఇ శివరామకృష్ణ

ఎసిబి వలలో అసిస్టెంట్ ఇంజినీరు

కాంట్రాక్టర్ నుంచి రూ.1.68 లక్షల లంచం తీసుకుంటుండగా అరెస్టు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఒక కాంట్రాక్టర్ నుంచి భారీగా లంచం తీసుకుంటుండగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎసిబి అధికారులు దాడి చేసి అసిస్టెంట్ ఇంజినీరును అదుపులోకి తీసుకున్నారు. ▶ 2లో

వైసిపి మంగళగిరి ఇన్‌ఛార్జిగా లావణ్య

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి మంగళగిరి సమన్వయకర్తను మార్చారు. మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కూమార్తె అయిన లావణ్యను నూతన సమన్వయకర్తగా నియమించారు. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి 9 గంటలకు ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్థానంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవిని ▶ 2లో

సిఎంను కలిసిన లావణ్య, హనుమంతరావు, ఆర్కే, కమల

రాజధానిలో తాగునీటి కోసం రాస్తారోకో

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం దొండపాడు అంబేద్కర్ కాలనీవాసులు తాగునీటి కోసం శుక్రవారం రాత్రి రాస్తారోకో చేపట్టారు. ఖాళీ బక్కెట్లలో రోడ్డుపై నిరసనకు దిగారు. 15 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో విజయవాడ - అమరావతి ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీలో దళితులు, ఇతర పేదలు ఉన్నారని, ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో తాగునీటి ట్యాంకర్ ఉన్నా అవసరాలకు తగినట్లుగా నీరు సరఫరా కావడం లేదని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అయితే గంట తర్వాత రాస్తారోకోను విరమించారు. ఆందోళన ఇంతటితో ముగియలేదని, ప్రయాణికులు, వాహనాల్లోని మహిళల ఇబ్బందులను గమనించే ఆందోళనను విరమిస్తున్నామని స్థానికులు ప్రకటించారు.

తాడేపల్లికి చేరిన పాదయాత్ర

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మాజీ సభ్యులు కె.బసవరావు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం తాడేపల్లికి చేరుకుంది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర నేటికి 1300 కిలోమీటర్లు పూర్తి చేసుకుందని బసవరావు చెప్పారు. పాదయాత్రకు తాడేపల్లి టోల్‌గేట్ వద్ద స్థానిక నాయకులు స్వాగతం పలికి బసవరావును సత్కరించారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె.కనకారావు, ఎం.వెంకటేశ్వరరావు, డి.వేమారెడ్డి, ఎమ్‌డి గోరెబాబు, రామకృష్ణారెడ్డి, ఎం.ప్రకాష్, బి.అనిల్, దాస్, ఎం.అంజిరెడ్డి, యు.కల్యాణ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తాడేపల్లి : పెనుమాకలో జగన్ ఫ్లెక్సీకి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. రాజధాని సామాజిక పింఛను రూ.5 వేలు చేసినందుకు గాను ఈ కార్యక్రమం చేపట్టారు.

రోశయ్యను కలిసిన మురళీకృష్ణ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



గుంటూరు పార్లమెంటు వైసిపి సమన్వయకర్త కిలారి రోశయ్యను శుక్రవారం గుంటూరు పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ-క్రాప్ నమోదు పూర్తి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : రబీ సీజన్‌లో పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలోని పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను మండలాల్లో 44,972 ఎకరాలలో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ-క్రాప్‌లో నమోదును గురువారానికి పూర్తి చేశామని పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి శుక్రవారం తెలిపారు. మూడు మండలాల్లో అన్నీ రైతు భరోసా కేంద్రాల వద్ద ఈనెల 1వ తేదీ నుండి 3 తేదీ వరకు ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శనకు ఉంచామని, రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ సభలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. గ్రామసభల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న ఈ-క్రాప్‌లో నమోదైన వివరాలన్నీ సమగ్రంగా చదివి వినిపిస్తామని చెప్పారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే రైతు భరోసా కేంద్రం సిబ్బందికి రాతపూర్వకంగా తెలపాలని సూచించారు. తుది జాబితా ప్రదర్శన తర్వాత మార్పులేమీ ఉండబోవని స్పష్టం చేశారు.

ఎసిబి వలలో అసిస్టెంట్ ఇంజినీరు

(మొదటి పేజీ తరువాయి)

పెదకూరపాడు ప్రాంతానికి చెందిన రవికిషోర్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ వద్ద రూ.1,68,000 లంచం తీసుకుంటూ ఉండగా అసిస్టెంట్ ఇంజినీరు శివరామకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించారు. మొత్తం రూ.42 లక్షల పనులు చేయగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించేందుకు సంబంధిత బిల్లులకు ఎం.బుక్స్ సిద్ధం చేయడానికి ఏఈ శివరామకృష్ణ భారీ మొత్తంలో నగదు డిమాండ్ చేశారు. దీంతో రవికిషోర్‌రెడ్డి ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఎసిబి అధికారుల సూచనల మేరకు రవికిషోర్‌రెడ్డి నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డిఎస్‌పి ప్రతాప్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దీక్షలో కూర్చున్న రైతులు, నాయకులు

నష్టపరిహారం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు ప్రస్తుత ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, ఈ సమస్యపై కలెక్టర్‌తో వ్యవసాయ శాఖ మంత్రితో చర్చిస్తామని చెప్పారు. అవసరమైనతే బాధిత రైతులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వద్దకు తీసుకు వెళ్తామన్నారు. బాధిత రైతుల జాబితాను ప్రమాణికంగా తీసుకొని ప్రకృతి విపత్తుల నిధి నుండి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేసేలా ఇన్సూరెన్స్ కంపెనీపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలన్నారు. యజమానికి సంబంధించి లోపాలున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కోరారు.

పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ మాట్లాడుతూ ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, విజయసాయిరెడ్డి, మంత్రి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్లను కలిసినా ప్రభుత్వం నుండి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీమా కంపెనీ, కోల్డ్ స్టోరేజ్ యజమానులకు లాయర్లుంటారని, నష్టపోయిన రైతులకు దిక్కెవరని ప్రశ్నించారు. ప్రభుత్వ యంత్రాంగం, రైతు సంఘాలతో కోల్డ్ స్టోరేజ్ యజమాని సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రిపోర్టు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ఒక జాబితా, కోల్డ్ స్టోరేజ్ యజమాని మరొక జాబితా ప్రకటించారని, ఇది రైతులను ఆయోమయంలోకి నెట్టిందని అన్నారు. బాధిత రైతులను ప్రభుత్వం సత్వరమే ఆదుకోకుంటే రోడ్ల దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లోకం భాస్కరరావు, ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోయారన్నారు. పంట పండించినప్పుడే మద్దతు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే పరిస్థితి రైతులకు వచ్చేది కాదన్నారు. పరిహారం దక్కేవరకూ రైతులంతా ఢిల్లీలో రైతుల పోరాట స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో పసుపురైతు బాధిత కమిటీ కన్వీనర్ వి.వెంకట్రామయ్య, కో-కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, కె.శివరామకృష్ణయ్య, కె.సురేంద్ర, బి.అగస్టీన్, వి.భారతి, బి.ధనలక్ష్మి, డి.వెంకట్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు, కె.కోటయ్య, సిహెచ్ పోతురాజు పాల్గొన్నారు.

క్షుణ్ణంగా పరిశీలించే పంపుతున్నాం

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశానికి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్‌తోపాటు జెసి ఎ.శ్యాంప్రసాద్, డిఆర్‌ఒ వినాయకం పాల్గొన్నారు. దరఖాస్తులు పరిష్కారం, ఎఎంఎఫ్, పోలింగ్ సిబ్బంది, అధికారుల ఖాళీలు, లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు తదితర అంశాలపై సిఇఒ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫామ్ 6,7,8 అన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన పూర్తి చేశామని, నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. పెండింగ్ ఫారాలను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణిచ్చామన్నారు. ఇదిలా ఉండగా పరిశ్రమల శాఖ ఆధ్వర్యములో ఫార్మైజేషన్ అఫ్ ఎంఎస్ఎంఇ, ఎంఎస్ఎంఇ సర్వే సపోర్టు పోస్టరును జిల్లా పరిశ్రమల అధికారి వెంకటేశ్వర్లు, జెసి, డిఆర్‌ఒతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు.

పర్యావరణ పరిరక్షణ కోసం విద్యుత్ వాహనాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, దానిని కాపాడుకునే క్రమంలో విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ పి.రాజశేఖర్ సూచించారు. వర్సిటీలోని డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్ అండ్ స్మార్ట్ గ్రిడ్స్' అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న పూణేలోని ఇండియా ఎల్ఎల్పి ఎలక్ట్రిషన్ ఇన్నోవేషన్ ఈటన్ లీడ్ ఇంజినీర్ ఎన్.రాజానంద్ పట్నాయక్ బ్యాటరీ, చార్జింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు డిజైన్ అండ్ కంట్రోల్ కన్వర్టర్ డిజైన్ అనే అంశంపై వివరించారు. మరొక రిసోర్స్ పర్సన్ గా పాల్గొన్న బెంగళూరులోని ఐ ఐ ఎస్ సి ప్రొఫెసర్ ఎల్.ఉమానంద్, గోవాలోని ఎన్ఐటి నుంచి వచ్చిన డాక్టర్ మిక్కిలి సురేష్ ఇంటిగ్రేషన్ ఆఫ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ విత్ గ్రిడ్ లేటెస్ట్ టెక్నాలజీ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్ అంశంపై మాట్లాడారు. వర్క్‌షాప్ డైరెక్టర్ ఎం.వాసవి ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వెహికల్స్ వినియోగం తద్వారా వచ్చే సవాళ్లను వివరించారు.

గుంటూరులోని ఆర్ఐఒ కార్యాలయంలో పరీక్షల నిర్వహణ లైవ్ స్ట్రీమింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు ఏసీ కాలేజీలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

హాజరవ్వాల్సి ఉండగా 14912 మంది (95.48 శాతం) హాజరయ్యారు. 706 మంది గైర్హాజరైనట్లు పల్నాడు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.నీలవతిదేవి తెలిపారు. పరీక్ష కేంద్రాలను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు సందర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డి పేటలోని వికాస్ జూనియ కళాశాల, రావిపాడులోని ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాలలో కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయించారు. పరీక్షా సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూస్తున్నారు.

వైసిపి మంగళగిరి ఇన్‌ఛార్జిగా లావణ్య

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేశారు. రెండునెలలు తిరగకుండానే చిరంజీవిని మార్పు చేశారు. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన కాండ్రు కమల, మురుగుడు హనుమంతరావు కుటుంబానికి చెందిన లావణ్యను ఎంపిక చేయడంతో పార్టీలో నెలకొన్న అంతరాలు బయటపడ్డాయి. నియోజకవర్గంలో ఈ రెండు కుటుంబాలకు పట్టుందని భావించి లావణ్యను ఎంపిక చేసినట్టు చెబుతున్నారు. టిడిపి నుంచి నారా లోకేష్ పోటీ చేస్తుండంతో ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం జగన్ చేనేత వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. దీంతో తొలుత గంజి చిరంజీవిని ఎంపిక చేసినా ఆయనతో నాయకులకు సమన్వయం పెరగడం లేదని భావించి లావణ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళగిరికి చెందిన నాయకులతో కీలక నేతలు చర్చలు జరిపారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, కాండ్రు కమల, మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవి చర్చల్లో పాల్గొన్నారు. పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చిన తరువాత చిరంజీవికి మరో అవకాశం ఇస్తామని పార్టీ జిల్లా సమన్వయకర్త విజయసాయిరెడ్డి భరోసా ఇవ్వగా చిరంజీవి అంగీకరించినట్టు తెలిసింది. చిరంజీవి రెండునెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నా ప్రజల నుంచి సానుకూలత రావడం లేదని ఐ ప్యాక్ సర్వే బృందాలు నిర్ధారించడంతో అధిష్టానం ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

టూరిజం విభాగం విద్యార్థులకు ప్రత్యేక ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : వర్సిటీలోని టూరిజం అండ్ హాస్పిటాలిటి మేనేజ్మెంట్ విభాగం విద్యార్థులకు ప్రత్యేకమైన ఆహ్వానం లభించింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, పర్యాటక ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యటన ప్రోత్సాహ కార్యక్రమానికి వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఇందులో పర్యాటకుల నిమిత్తం ఆయా సందర్శన ప్రాంతాలకు వెళ్లేవారి కోసం 18 పర్యాటక ప్యాకేజీలను, 6 పర్యాటక బస్సులను మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మృతురాలు లక్ష్మీ నాగజ్యోతి

ప్రజాశక్తి-మంగళగిరి

అనుమానాస్పద స్థితిలో వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మంగళగిరి నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పట్టణ ఎస్ఐ ఎస్ కే బాజీ బాబు కథనం ప్రకారం అత్తోట గ్రామానికి చెందిన కాకర్ల లక్ష్మీ నాగజ్యోతి(29) మంగళగిరి నగరంలోని పార్కు రోడ్డుకు చెందిన కాకర్ల బాజీ తో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలు అనా రోగ్య కారణంగా గహంలో ఉరివేసుకొని మతి చెందినట్లుగా ఎస్సై తెలిపారు. ఈ మేరకు 174 సెక్షన్ ప్రకారం అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా మృతురాలు బంధువులు లక్ష్మీ జ్యోతి ఆత్మహత్య చేసుకోలేదని భర్త బాజీయే హత్య చేసినట్లుగా ఆరోపిస్తున్నారు.

నక్కల దాడిలో మనబోతు మృతి

ప్రజాశక్తి-వినుకొండ

నక్కల దాడిలో మనబోతు మృతి చెందిన సంఘటన బొల్లాపల్లి మండలంలోని బండ్లమోటులో గురువారం రాత్రి చోటు చేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామం లోని సబ్ స్టేషన్ సమీపంలో సంచరిస్తున్న మనబోతుపై నక్కలు గుంపుగా దాడిచేశాయి. ఈ దాడిలో మనబోతు అక్కడికక్కడే మృతి చెందింది. ఈమేరకు గ్రామస్తులు పోలీసులు సమాచారం అందించగా, బండ్లమోటు పోలీసులు సంఘటనా ప్రాంతానికి వెళ్లారు. వెంటనే పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామకృష్ణ సంఘటనా ప్రాంతానికి వెళ్లి మృతి చెందిన మనబోతును స్వాధీనం చేసుకున్నారు. వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం మండాది ఉప్పలపాడు మధ్య బోడుపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మహిళ మరో యువకుడు గాయపడ్డారు. హైదరాబాదులో భవన నిర్మాణ పనులలో పనిచేసే మేస్త్రి బొల్లా గురుస్వామి స్వగ్రామమైన కనిగిరికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. మార్గ మధ్యంలో మండధి దాటాక బోడుపై మిర్చి కూలీలతో వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనంతో ఢీకొంది. ఆటోలో ఉన్న మాచర్లకు చెందిన డేరంగుల అనంతలక్ష్మికి, గురుస్వామికి గాయాలయ్యాయి మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

56 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఆర్.టి.సి బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల కార్తికేయ హోటల్ వెనుక వైపు అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసి, అమ్ముతుండగా విజిలెన్సు అధికారులు దాడి చేసి 56 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా, తాళ్ళూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన పాదర్తి కుమార్ రాజా తన ఇంటి వద్ద గృహ అవసరాలకు ఉపయోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల లోని గ్యాస్ ను, కమర్షియల్ సిలిండర్ల లోనికి మార్చి అక్రమాలకు పాల్పడుతున్నారు. పులుగు రామకృష్ణ ,చిచ్చుల సుబ్బారావు సహాయముతో హోటల్స్, వ్యాపారుస్తులకు రూ. 1600 నుంచి 1650కి విక్రయిస్తున్నారు. నిల్వ ఉంచిన 24 నిండు సిలిండర్లు, 32 ఖాళీ సిలిండర్లు మొత్తం 56 సిలిండర్లు) లను స్వాధీనం చేసుకుని కుమార్ రాజా, రామకృష్ణ, సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్టు సిఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

మాట్లాడుతున్న దేవినేని ఉమామహేశ్వరరావు, అరవిందబాబు తదితరులు

పల్నాడులో టిడిపి పుంజుకుంది : దేవినేని

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శనివారం జరగనున్న 'రా.. కదిలిరా' బహిరంగసభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు కోరారు. ఈ సభ విజయవంతం కోసం సమీక్ష నిర్వహించేందుకు నరసరావుపేట వచ్చిన దేవినేనికి నరసరావుపేట టిడిపి ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవినేని మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో టిడిపి బలం పుంజుకుందని, రానున్న ఎన్నికల్లో పల్నాడు జిల్లా వ్యాప్తంగా టిడిపి జెండా ఎగురవేయడం ఖాయ మన్నారు. చంద్రబాబు నాయుడు సభలో వైసిపి నుండి టిడిపిలోకి భారీ చేరికలు ఉన్నాయన్నారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ సభకు జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా టిడిపి,జనసేన ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వర రావు, ఎస్టీ సెల్ నాయకులు దారునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీను సందర్శించిన న్యాక్ బృందం

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 29, మార్చి 1వ తేదీల్లో న్యాక్ బృందం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ బృందానికి చైర్‌పర్సన్ గా డాక్టర్ అశోక్ బోటే మాజీ వైస్ ఛాన్సలర్ శివాజీ యూనివర్సిటీ కొల్హాపూర్ మెంబర్ కోఆర్డినేటర్ గా, డాక్టర్ నారాయణ ఫారుక్ ప్రొఫెసర్ ఏపీఎస్ యూనివర్సిటీ మధ్యప్రదేశ్ మెంబర్‌గా, డాక్టర్ బ్రాజేష్ కుమార్ త్రిపాటి ప్రిన్సిపాల్ హిరాలాల్ రామ్ నివాస్ పీజీ కాలేజీ ఖలీలాబాద్ యూపీ వ్యవహరించారు. నివేదిక రూపొందించి అందజేయగా సంతృప్తి వ్యక్తపరిచినట్లు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికలు తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్ లో ఆగివున్న రైలు కింద నుండి పట్టాలు దాటే ప్రయత్నంలో రైలు కదలటంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్ళాల్సిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ 8.40 గంటలకు వచ్చింది. సత్తెనపల్లి లో హాల్ట్ లేనప్పటికి వందేభారత్ రైలు క్రాసింగ్ కోసం స్టేషన్‌లో ఆగింది. ఈ నేపథ్యంలో రైలు ఆగిందని భావించి రైలు కింద నుంచి పెట్టాలి దాటే ప్రయత్నం చేయ డంతో ఈ ప్రమాదం జరిగింది. రైల్వే పోలీసులు సం ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు ,మతుడు తెల్ల చొక్కా తెల్ల లుంగీ ధరించాడని, వయసు 52 సంవత్సరాలు ఉంటాయని రైల్వే పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE:: GUNTUR

OS No: 934/ 2023

Between:
State Bank Of India, RACPC, Guntur,
Rep.by its Manager-Recovery ....Plaintiff
And
Kalapala Venkaiah ..... Defendant
To.
Kalapala Venkaiah,S/o.Kotaiah,
R/o.Door No.7-216, Yerracheruvu,
Edlapadu-522233, Edlapadu Mandal,
Guntur Dist., Presently Palnadu Dist.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:27-03-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:27-03-2024

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్,
రవీంద్ర నగర్, గుంటూరు.

ఒప్పిచర్లలో తిరుణాల మహోత్సవం

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని ఒప్పిచర్లలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఇక్కడికి వచ్చారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవాలయం విశిష్టత గురించి ఆచారవంతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం నుండి మళ్లీ తాను పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. మండల పరిషత్ ప్రెసిడెంట్ బి.సావిత్రి, అల్లయ్య, రామిదేని.లక్ష్మీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ADDANKI ANIL KUMAR S/o AYYAVARLU R/O Dr.No.21-14-12/17, Thota vari Street 2 Ramalingeswarapet, Tenali 522201, Guntur District. That by mistake in my passport my Spouse name has been mentioned as **SAI SRILAKSHMI ADDANKI** (Old Name) instead of **SAI SRILAKSHMI YALAVARTHI** (New Name), in the said Documents, in her all is civil documents Aadhar Card and PAN card etc. Hence I declare my wife name **SAI SRILAKSHMI YALAVARTHI** as per vide affidavit dated 01-03-2024 before the Notary.

మిర్చి నిల్వలు

బ్యాగులు		
మిర్చి దిగుమతి	:	1,21,485
మిర్చి ఎగుమతి	:	1,39,573
మిర్చి నిల్వ	:	88,835

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 20,500
నెం.5	10,000 - 18,000
273	12,000 - 17,500
341	9,500 - 20,000
4884	9,000 - 19,500
సూపర్ 10	13,000 - 15,700
నాన్ ఏసి	
తేజ	8,500 - 20,700
బడిగి	10,000 - 20,000
దేవనూరు డీలక్స్	11,500 - 20,500
తాలుకాయలు	5,000 - 12,500

ప్రమాద బాధితులకు పెమ్మసాని సాయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుకు సమీపంలో శుక్రవారం తెలవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబసభ్యులను, గాయపడిన వారిని టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ ఘట నపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పందించి సానుభూతిని, సంతాపాన్ని తెలి పారని చంద్రశేఖర్ తెలిపారు. నారా లోకేష్ తరపున మృతుల కుటుంబాలను తాను పరామర్శించానని చంద్రశేఖర్ అన్నారు. మృతులకు, గాయాలపాలైన వారికి తమ వంతు ఆర్థిక సాయం అందించామని, అవసరం మేరకు మరే ఇతర సాయానికైనా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో మంగళగిరికి చెందిన గార్లపాటి వెంకట సుబ్బమ్మ (45), గార్లపాటి శ్యామ్ దీక్షిత్ (6), గార్లపాటి పావని (19) అక్కడికక్కడే మతి చెందగా, ఏకల లక్ష్మణ్ శ్రీకాంత్(29), గార్లపాటి నాగలక్ష్మి (39) తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున గాయపడ్డ వారిలో ఒక్కొక్కరికి రూ. 25 వేలు ఆర్థిక సాయంగా అందించారు.

పల్స్‌పోలియోకు 4040 మంది చిన్నారుల గుర్తింపు

ప్రజాశక్తి - యడ్లపాడు : పల్స్ పోలియో సందర్భంగా ఆదివారం మండలంలోని ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 3681 మంది చిన్నారులు ఉన్నారని, వీరు కాకుండా హైరిస్క్ ప్రాంతాలైన స్పిన్నింగ్ మిలులు, క్వారీలు, ఇటుక బట్టీలు తదితర చోట్ల మరో 359 మంది ఉన్నారని, మొత్తంగా 4040 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందని వివరించారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఎం.సుందరరావు s/o శౌరయ్య అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పొందిన డాక్యుమెంట్ (Doc No.4911/2010) తో 28-02-2024 న ద్విచక్ర వాహనంపై చిరుమామిళ్ల గ్రామం నుండి నాదెండ్ల వెళుతుండగా మార్గంమధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల సెల్.నెం 939338441 కు సమాచారం ఇవ్వగలరు. ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియోగ పరచాలని చూస్తే చట్టపరంగా నేను తీసుకొను చర్యలకు బాధ్యులగుదురు.

డాక్యుమెంటు పోయినది

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన మట్టుకొయ్య బుల్లియ్యకు సంబంధించి సిఆర్‌డిఎ పరిధిలోని 150 చ.గ.ల వాణిజ్య స్థలానికి చెందిన లింకు డాక్యుమెంటు పోయినది. మంగళగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన దస్తావేజు డాక్యుమెంట్ నెంబర్ : 12031/2019, తేదీ : 30-07-2019 ద్వారా సదరు స్థలాన్ని నా తండ్రి గారైన మట్టుకొయ్య ఇస్సాకు s/o శేషయ్య వగైరాలు నాకు గిఫ్ట్‌గా రిజిస్ట్రేషన్ చేసియున్నారు. సదరు డాక్యుమెంటుకు లింకు డాక్యుమెంటు నెంబర్ : 5097/2018, తేదీ 1-03-2018 అయి ఉన్నది. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటు తీసుకొని 24-2-2024న నా ఇంటి వద్ద నుండి మంగళగిరికి జిరాక్స్ నిమిత్తం బైక్‌పై వెళుచుండగా మార్గ మధ్యంలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మట్టుకొయ్య బుల్లియ్య
మక్కెవారిపేట, నవులూరు, మంగళగిరి,
గుంటూరు జిల్లా ఫోన్ : 9849614052

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, SANGAREDDY DISTRICT AT: SANGAREDDY
I.A.No. 492/2023 in O.S.No. 65/2023

Between:-
Seri Sudhakar Reddy and others
...Petitioners/Plaintiff
And
Smt.Seri Laxmamma and others
...Respondents/Defendants
To,
R-16. Seshu Madhava Alla S/o Appa Rao Alla, aged about: 55 years, Occ:Service, R/o: D.No.2-7, Nagulapadu Post, Pedanandipadu Mandal, Guntur District, Andhra Pradesh-522235.

Take notice that, the above named Petitioners/Plaintiffs filed the above suit for partition and Separate possession vide O.S.No.65/2023 against you and others and also field above I.A.No.492/2023 for seeking injunction order against you and others and the same is stands posted to 13-03-2024 for your appearance.

Therefore you are hereby informed to be present on 13-03-2024 at 10-30 a.m., before the above said Court either in person or through an Advocate, failing which the matter will be decided against you as per the Law.

(BY ORDER OF THE COURT)

Date:28-02-2024

M.Narsingh Rao,
Advocate,
Shankarpally,
RR District.
Cell No.9440017511

విలేకరులతో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

ఓటమి భయంతోనే అక్రమ అరెస్టులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఎన్నికలకు 50 రోజులుండగానే జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి మీద భయం పట్టుకుందని అందుకే టిడిపి, జనసేన నాయకుల్ని తప్పుడు కేసులతో అరెస్టు చేయిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు ఏం చేశారో అది చెప్పి ఓట్లడిగే ధైర్యం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని, అందుకే టిడిపి, జనసేన నాయకుల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అరెస్టును తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందన్నారు. శరత్‌కు ఎలాంటి హాని కలిగించినా అందుకు ముఖ్యమంత్రితే పూర్తి బాధ్యతన్నారు. సమావేశంలో నాయకులు షేక్ నాగుల్‌మీరా, సిహెచ్.శ్రీనివాసరావు, టి.జయప్రకాష్ నారాయణ, బి.వెంకటస్వామి, ఎ.అమరేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై వాగ్దేవి విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నరసరావుపేట : ఆర్థిక అక్షరాస్యతపై పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డిగ్రీ పూర్తిచేసిన తరువాత మీ సామర్థ్యాలను బట్టి వ్యాపారాన్ని ప్రారంభించుకోవడానికి బ్యాంకులు ఎంతో సహకరిస్తాయని చెప్పారు. రిజర్వ్ బ్యాంకు ద్వారా అందించే పథకాలను తెలుసుకోవాలని సూచించారు. నరసరావుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో యూనియన్ బ్యాంకు సహకారంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు నడుస్తున్నాయని చెప్పారు. విద్యార్థి దశ నుండే పొదుపును అలవాటు చేసుకోవాలని, చట్టబద్ధత కలిగిన ఆర్థిక సంస్థలతో ఆర్థిక కార్యకలాపాలే నిర్వహించాలన్నారు. ఫేక్ యాప్స్ వద్ద రుణాలు తీసుకోవద్దని, సైబర్ నేరాల బారిన పడొద్దని సూచించారు.

తాగునీటి కోసం 4న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ : బొల్లాపల్లి మండల ప్రజలు తాగునీరు దొరక్కా అల్లాడుతున్నారని, పంటలు ఎండిపోయి తీవ్ర కరువు కోరల్లో కూరుకుపోయారని, ప్రభుత్వం వెంటనే స్పందించి తాగునీరు సరఫరా చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటనాయక్ కోరారు. ఈ సమస్యపై కలెక్టరేట్ వద్ద 4వ తేదీన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో జనం నీటి కష్టాలు పడుతున్నారని, వ్యవసాయ బోర్లలో కూడా మూడు నాలుగు రోజులకు ఒకసారి వస్తున్న నీటిని నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితిలో ప్రజలున్నారని తెలిపారు. నీరు లేక స్నానాలు కూడా నాలుగు రోజులకు ఒకసారి చేసే దుర్భర దుస్థితి పట్టిందని పేర్కొన్నారు. బొల్లాపల్లి మండలంలో ఈ సమస్య దీర్ఘకాలికంగా నెలకొన్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ సమస్య ఉండదని తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని కొంత సరఫరా చేస్తున్నా అధికార పార్టీ పక్షపాత ధోరణి వల్ల అందరికీ అందడం లేదని, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి బొల్లాపల్లి మండలానికి తాగునీరు అందించాలన్నారు.

అన్నం పెడుతున్నా అర్ధాకలే..!

- నెలల తరబడి బిల్లులు, గౌరవవేతనాలు దక్కని గోరుముద్ద నిర్వాహకులు
- అప్పులు చేసి పథకం నిర్వహణ
- గుడ్లు, రాగిజావకు ఇస్తామన్న డబ్బులదీ అదేగతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బడిగా రాగానే రాగిజావతోపాటు మధ్యాహ్నం వేళ భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు, గౌరవ వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. పట్టణంలో 84 పాఠశాలల్లోని 2488 మంది విద్యార్థులకు 105 మంది మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం అందిస్తున్నారు. వీరికి నాలుగు నెలల నుండి బిల్లులు బకాయిలున్నాయి. దీంతో అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తున్నారు. దీనికితోడు ఐదేళ్ల కిందట నిర్ణయించిన మెనూ ధరలకు, తాజాగా ఉన్న ధరలకు పొంతనే లేదని గ్యాస్ ధరలు కూడా రెండింతలు పెరిగాయని వాపోతున్నారు. ప్రస్తుతం 1-5 తరగతుల వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.7.40 ఇస్తుండగా 6-10 తరగతుల వారికి రూ.8.75 చొప్పున ఇస్తున్నారు. దీన్ని రూ.12... రూ.15గా పెంచాలని నిర్వాహకులు కోరుతున్నారు. దీంతోపాటు తమకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేల గౌరవవేతనం సరిపోవడం లేదని, ఎన్నికల హామీ ప్రకారం రూ.10 వేలకు పెంచాలని అంటున్నారు. కోడిగుడ్డు ఉడకబెట్టినందుకు 10 పైసలు, రాగిజావ కాచినందుకు 10 పైసులు ఇస్తామని రెండేళ్ల కిందట ప్రకటించినా ఇంత వరకు ఇవ్వలేదని అంటున్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని వేడుకుంటున్నారు. ప్రతినెలా గౌరవవేతనంతోపాటు బిల్లులు మంజూరు చేయాలని, ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరుతున్నారు.

34,652 మందికి రూ.32.57 కోట్ల విద్యాదీవెన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైఎస్ఆర్ విద్యాదీవెన త్రైమాసిక నగదును ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం కృష్ణా జిల్లా, పామర్రులో బహిరంగ సభ నుండి విడుదల చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఎల్.శివశంకర్, విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు సంబంధించి 34,652 మంది విద్యార్థినీ విద్యార్థులకు సంబందించి రూ.32.57 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమైనట్లు తెలిపారు. వీరిలో ఎస్సీలు 7070 మందికి రూ 5.65 కోట్లు, ఎస్టీలు 2494 మందికి రూ.2.10 కోట్లు, బీసీలు 10814 మందికి రూ.9.79 కోట్లు, ఈబీసీలు 8468 మందికి రూ.9.50 కోట్లు, కాపులు 2616 మందికి రూ.2.46 కోట్లు, ముస్లిమ్ మైనార్టీలు 3229 మందికి రూ.2.96 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీలు 109 మందికి రూ.11 లక్షలు లబ్ధి చేకూరినట్లు వివరించారు. ఈ మేరకు మెగా చెక్కును విద్యార్థులకు కలెక్టర్ అందించారు.

విద్యార్థులకు మెగా చెక్కును అందిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

వేసవిలో తాగునీటికి ఇబ్బంది రానివ్వొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామోదయం నవోదయం కార్యక్రమంపై శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి మండల ప్రత్యేకాధికారలు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బంగారుతల్లి కార్యక్రమంపై తల్లుల్లో అవగాహన కల్పించాలన్నారు. వేసవి రానున్న దృష్ట్యా తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. 10 వతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విదార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా చర్చించి వారి వారి పిల్లలు పరీక్షలు బాగా రాసేలా అవగాహన కల్పించాలన్నారు. పిల్లలపై హెచ్ఎంలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామోదయం/నగరోదయం కార్యక్రములో గుర్తించిన సమస్యలకు ఎంతవరకు పరిష్కారమయ్యాయో వివరాలు అడిగారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేచవరంలో జెసి పర్యటన

ప్రజాశక్తి - నకరికల్లు

గ్రామోదయంలో భాగంగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మండలంలోని దేచవరంలో పర్యటించారు. రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. పాల వెల్లువ లబ్ధిదారులతో అమూల్ కేంద్రానికి పాలు పోసే విధానం గురించి వివరించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో గర్భిణులకు పోషక ఆహార కిట్స్ పంపిణీ, ప్రభుత్వం అందజేసిన ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారో లేదో? తెలుసుకున్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మంచి మార్కులు తెచ్చుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జెసి వెంట మండల ప్రత్యేకాధికారి బాలునాయక్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో జయమణి, వైసిపి మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి ఉన్నారు.

దేచవరం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

కార్మికులంతా సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరాలి

- సత్తెనపల్లి తాపీవర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం
- ప్రమాదానికి గురైన వారికి సాయపడాలని నిర్ణయం
- నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రతి భవననిర్మాణ కార్మికుడు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలేరమ్మ గుడి సెంటర్లో జరిగిన సత్తెనపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి బొల్లెపల్లి మహేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికుడు సంవత్సరంలో ఒకరోజు వేతనాన్ని చెల్లించి సత్తెనపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ సభ్యత్వం పొందాలని అన్నారు. యూనియన్ సభ్యత్వం పొందిన భవన నిర్మాణ కార్మికుడు ఏ కారణం చేతనైనా మృతి చెందినచో మట్టి ఖర్చులకు రూ.10 వేలు, ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికునికి రూ.5 వేలను యూనియన్ ద్వారా అందిస్తామని చెప్పారు. అనంతరం ఏడుగురుతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బొల్లెపల్లి మహేష్, పాపిశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, సహాయ కార్యదర్శిగా వాసి బాలస్వామి, కోశాధికారిగా పసుపులేటి సీతయ్య, సభ్యులుగా చేపూరి ఏడుకొండలు, సుకమంచి వెంకట్రావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రులు పాపిశెట్టి బాలచంద్రరావు, దరిపల్లి రామకోటయ్య, శివయ్య, ఇమామ్ వలి, పుట్ట నరసింహారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బిజెపిని, ఆ పార్టీకి మద్దతిస్తున్న వారిని ఓడించండి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

దేశంలో లౌకికకత్వాన్ని విధ్వంసం చేసి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తున్న బిజెపిని, ఆ పార్టీని మద్దతిస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ఆర్థికాభివృద్ధికి మూలమైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ దుర్మార్గమైన పాలన చేస్తుందని ధ్వజమెత్తారు. గవర్నర్లను ఉపయోగించి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్ష టిడిపి బిజెపి అంటకాగుతున్నాయని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయకపోయినా బిజెపి మద్దతివ్వడం సిగ్గుచేటన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణంలో ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రైల్వే స్థలాల్లో ఉంటున్న వారి ఇళ్లను రెగ్యులరైజ్ చేసి పట్టాలివ్వాలని కోరారు. గత పుష్కరాల సందర్భంగా తొలగించిన ఇళ్లకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కె.కరుణాకరరావు, వి.దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, వై.బర్నబస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరిలో

తెనాలిలో

ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం జరిగాయి. మంగళగిరి పట్టణంలో నిర్మల జూనియర్ కాలేజీ, విజే జూనియర్ కాలేజీ, సీకే జూనియర్ కాలేజీ, నారాయణ జూనియర్ కాలేజీ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు జరిపారు. మొత్తంగా ఐదు సెంటర్లలో 1500 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ప్రజాశక్తి-తెనాలి :ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మొత్తం 14 పరీక్ష కేంద్రాల్లో 4,624 మంది విద్యార్థులను కేటాయించారు. తొలిరోజు కావటంలో కొందరు విద్యార్థులు ఆయా సంస్థల వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలిరాగా, కొందరిని తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలపై పరీక్ష కేంద్రాలకు చేరారు. మొత్తం మీద పరీక్ష కేంద్రాలకు ఉదయం ఏడు గంటల నుంచే తాకిడి మొదలైంది. తొలిరోజు పరీక్ష ప్రశాతంగా ముగిసింది.

సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-తెనాలిరూరల్

భవన నిర్మాణ కార్మికులకు వైసిపి అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసిపి ఇచ్చిన వందశాతం వాగ్దానాలు అమలు చేశామని ఊదరగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 1214 మెమో విడుదల చేసి అమలవుతున్న సంక్షేమ పథకాలను కూడా ఆపివేయటం ఎంతవరకు సమంజసమో జగన్మోహన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల సభల్లో పేదల పక్షాన నేను ఉంటానని చెప్పే ముఖ్యమంత్రి భవన నిర్మాణ కార్మికులు పేదవారా కాదా చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.300 కోట్ల పెండింగ్ క్లైములు పరిష్కారంలో ఉండగా, జిల్లాలో రూ.10 కోట్ల పెండింగ్ క్లైములు పరిష్కారంలో ఉన్నాయని అన్నారు. పేదల పక్షాన ఉండేట్లయితే తక్షణమే జగన్మోహన్ ప్రభుత్వం పెండింగ్ క్లైములు పరిష్కారానిక కృషి చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. వైయస్సార్ బీమా భవన నిర్మాణ కార్మికులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి, దాని ద్వారా అమలవుతున్న 15 రకాల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికలకు సిద్ధమని చెప్పే జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులు కూడా ఎన్నికలకు సిద్ధంగానే ఉన్నారని, భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి కార్మికుల సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టినగతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమానికి అహ్మద్ అధ్యక్షత వహించగా తెనాలి కార్యదర్శి శ్రీనివాసరావు, కరిముల్లా, సిఐటియు మండల కార్యదర్శి ఎస్కే హుస్సేన్ వలి, మిక్కంటి నాయకత్వం వహించారు.

ఈ-క్రాప్ ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

రబీ 2023-24 సీజన్‌కుగాను జిల్లాలో 1,57,465 ఎకరాల్లో సాగైన అన్ని రకాల పంటలను ఈ-క్రాప్‌లో నమోదు ప్రక్రియ ఫిబ్రవరి 29వ తేదీతో పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో మార్చి 1 నుండి 3వ తేదీ వరకూ ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించటం జరుగుతుందని, ఆర్‌బికెల పరిధిలో గ్రామ సభలు కూడా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సభలలో ముసాయిదాలోని వివరాలు అన్ని చదివి వినిస్తారన్నారు. కావున రైతులు జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం ఆర్‌బికె కేంద్రంలో సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి సకాలంలో శిక్షణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు :ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ప్రత్యేక బృందాలు, నోడల్ అధికారులను నియమించి శిక్షణా కార్యక్రమాలను సక్రమంగా పూర్తి చేయటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్‌మీనాకు తెలిపారు. శుక్రవారం ముఖేష్‌కుమార్ మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్‌ఓ పెద్ది రోజాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతలో భాగంగా వివిధ విభాగాల సిబ్బందికి శిక్షణను నిర్దేశిత సమయంలో పూర్తి చేయటం జరుగుతుందన్నారు. జిల్లా కంట్రోల్‌రూం, కంప్లైయిట్ మేనేజ్మెంట్, రిపోర్టింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, సోషల్ మీడియా సెల్ ఏర్పాటు, ఎన్ఫోర్స్మెంట్ ఎజెన్సీలకు నోడల్ అధికారులను నియమించటం జరిగింద న్నారు. ఓటరు క్లైయిమ్‌లు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై మాట్లాడారు. సమావేశంలో ఆర్డిఓ శ్రీఖర్, జిఎంసి అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కమిటీ, డిస్ట్రిక్ట్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ కమిటీలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కమిటీ, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా బ్రీఫింగ్ , డిస్ట్రిక్ట్ ఎక్స్పెండీచర్ మానిటరింగ్ కమిటీ, సి-విజిల్ , 1950 కాల్ సెంటర్ , కంప్లైంట్ సెల్, కంట్రోల్ రూమ్ కమిటీలలో విధులు కేటాయించిన నోడల్ అధికారులు, సూపర్ వైజర్లు, సపోర్టింగ్ స్టాఫ్‌కు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, నగర కమిషనర్ కీర్తిచేకూరి, డీఆర్ఓ పెద్దిరోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, స్వాతి , రవీంద్ర రావు, ఆర్డీఓ శ్రీఖర్ , నగర అదనపు కమీషనర్ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఆయా కమిటీల సభ్యులకు కలెక్టర్ ఎన్నికల నియమావళిని వివరించారు.

అవార్డు అందుకుంటున్న బ్యాంకు అధికారులు

సిజిజిబికి జాతీయ స్థాయి ఎంఎస్ఎంఇ పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు : ఎంఎస్ఎంఇ రంగాన్ని బలోపేతం చేయటానికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు కృషికి గుర్తింపుగా చాంబర్ ఆఫ్ ఇండియన్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఉత్తమ ఆర్‌ఆర్‌బి అవార్డు అందజేసింది. ఫిబ్రవరి 29న ఢిల్లీలో జరిగిన ఎంఎస్ఎంఈ బ్యాంకింగ్, ఎంఎస్ఇఎఫ్‌సి ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ మంత్రి నారాయణ్ టాబు రాణే, సుప్రీం కోర్టు రిటైర్డ్ జస్టిస్ దీపిక్ వర్మ చేతులమీదుగా సిజిజిబి జనరల్ మేనేజర్ పి.మారుతీరామ్, సీనియర్ మేనేజర్ వి.ఎస్.పవన్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ అవార్డును ఎంఎస్ఎంఇ రంగాన్ని ప్రోత్సహించటంలో అచంచలమైన అంకితభావం, పట్టుదల కలిగిన ఉద్యోగులకు అంకితం చేస్తున్నట్లు చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్ఎంఇల క్రెడిట్ అవసరాలు తీర్చటానికి సిజిజిబి రూ.288.86 కోట్లు రుణాలు ఇచ్చి, తద్వారా రంగం పునరుద్ధరణకు గణనీయంగా తోడ్పడినట్లు చెప్పారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో జరుగుతున్న బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శుక్రవారం 144 జట్ల మధ్య 72 మ్యాచ్‌లు జరిగాయి. తెలుగు యువత నియోజకవర్గ నాయకులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు. నారా లోకేష్ నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరావతి పింఛను రూ.5 వేలు అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు :అమరావతి ఫించన్ రూ ఐదు వేలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే , నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త మేకతోటి సుచరిత లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం రాజధాని ప్రాంతం లోని భూమి లేని నిరుపేదలకు అమరావతి ఫించన్ రూ 2,500 లను రూ 5 వేలకు పెంచింది.పెంచిన రూ 5 వేలను సుచరిత లబ్ధిదారులకు శుక్రవారం తుళ్లూరులో అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ,రాజధాని అమరావతి ప్రాంతంలో భూమిలేని పేదలకు ఫించన్ రూ 2,500 లను రూ 5 వేలకు పెంపు, అసైన్డ్ రైతులకు కౌలు, ఇతర సమస్యలు,రైతులకు ఈ ఏడాది కౌలు చెల్లింపు లాంటి ఇబ్బందులు తన దష్టికి వచ్చాయని చెప్పారు. ఫించన్ పెంపు విషయం సిఎం జగన్ కు చెప్పగానే అంగీకరించారని సంతోషం వ్యక్తం చేశారు.తాడికొండ నియోజక వర్గంలో సామాజిక బస్సు యాత్ర,సిఎం సభ నిర్వహణ సక్సెస్ అయ్యాయని,సిద్ధం సభ కూడా విజయవంతం అవుతుందని చెప్పారు. తుళ్లూరు మండలంలో వైసిపికి మెజార్టీ వస్తుందని సుచరిత ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తమకు అమరావతి ఫించన్ ఇప్పించాలని,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తమకు ఆటో లు నిలుపు కునేందుకు స్థలం కేటాయించాలని సుచరితకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమం అనంతరం వైసిపి గ్రామ అధ్యక్షులు ఆలోకం సురేష్ జన్మ దిన వేడుకలలో సుచరిత పాల్గొన్నారు. స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల ఎంపిని కలిసిన యార్డు నూతన ఛైర్మన్

ప్రజాశక్తి - కారంపూడి

దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు చైర్మన్ గా నూతనంగా నియ మిం చిన కొమ్ము కౌశల్య , బాపట్ల ఎంపి నం దిగం సురేష్‌ను మర్యాద పూర్వ కంగా కలిశారు. పల్నాడు జిల్లా వైసిసి నాయ కుడు కొమ్ము చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన నాగమ్మ

ప్రజాశక్తి - రెంటచింతల

పదవులు బాధ్యతలను పెంచుతాయని, క్షేత్రస్థాయిలో గ్రామీణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తే వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని జెట్టిపాలెం సర్పంచిగా దావులూరి నాగమ్మ శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని సూచించారు. గ్రామంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులు పూర్తయినట్లు చెప్పారు. కార్యక్రమంలో పిఆర్ డిఇ పాశం శ్రీనివాసరెడ్డి, ఎంపిపి సంపూర్ణమ్మ, వైసిసి మండల కన్వీనర్ జి.బ్రహ్మారెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూ ర్తి భరోసా కల్పిస్తోందని చిలకలూరిపేట నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త మల్లెల రాజేష్ నాయుడు అన్నారు. నియోజకవర్గ స్థాయిలో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం నియో జకవర్గ ఎన్నికల కార్యాలయంలో పంపిణీ చేశారు. సందెపూడి గ్రామానికి చెందిన బొగ్గవరపు ప్రకృతికి రూ.1,10,000, పురుషోత్తమపట్నంకు చెందిన ఆశా కమలాదేవికి 45,000, జాలాదికి చెందిన కూరాకుల సంపత్ రావు కు రూ.25,000 చెక్కులను పంపిణీ చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వార్షికోత్సవం

పట్టణంలోని పోలిరెడ్డిపాలెం నల్లకుంట వద్ద గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 7వ తేదీన 30వ వార్షికోత్సవ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వాల్‌పోస్టర్లను వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త మల్లెల రాజేష్ నాయుడు గురువారం ఆవిష్కరించారు.

'గీతాంజలి' కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక గీతాంజలి స్కూల్, రెసిడెన్షియల్ క్యాంపస్ ,నెక్స్ట్ జెన్ కిడ్స్ విద్యార్థులకు పాఠశాల 23వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం 2వ రోజు జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ షకీలా బేగం మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కష్టానికి మంచి ప్రతిఫలం ఇవ్వాలని ఆకాంక్షించారు. పట్టణ సిఐ ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ చిన్నారులు విద్యార్థి దశ నుండే మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేళ్ళ క్రిష్ణవేణి, కరస్పాండెంట్ వైఎల్ కిషోర్ పాల్గొన్నారు.

జిల్లాలో 1,22,000 'ఆరోగ్య శ్రీ' కార్డులు పెండింగ్

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

'నగరోదయం'లో భాగంగా సత్తెనపల్లిలో ఇళ్ళ రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

పల్నాడు జిల్లాలో లక్షా ఇరవై రెండు వేల ఆరోగ్య శ్రీకార్డులు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు.నగరోదయం కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని 25 వార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునే ఉద్దేశంతో 'నగరోదయం' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శ్రీకార్డులు ఎంతమందికి పంపిణీ చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సత్తెనపల్లి లో 90 శాతం వరకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారని పేదలందరికి ఇళ్ళు రిజిస్ట్రేషన్ 90 శాతం పూర్తయినట్లు చెప్పారు. జిల్లా లోని బాలికలు రక్తహీనతతో బాధ పడుతున్నారని వారికీ పౌష్టికాహారం అందజేస్తున్నామని, బంగారు తల్లి పథకం కింద వారికి కార్డులు పంపిణీ చేసి అందులో రక్త పరీక్షల వివరాలు నమోదు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో వి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.షమీ, మున్సిపల్ ఛైర్ పర్సన్ లక్ష్మి తులసి, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమీక్షలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

జగనన్న కాలనీల్లో పంపిణీ చేసిన స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ లకు సంబంధించి స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల మున్సిపల్ అతిది గృహంలో వార్డు నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులను పిలిపించి వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, అదేవిధంగా ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని సంబంధిత సాంకేతిక బృందానికి పంపించి ఫార్వర్డ్ చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బిఎల్ఒ లతో సమీక్ష

నరసరావుపేట పట్టణానికి సంబంధించి బూత్ లెవెల్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫార్మ్-6, ఫార్మ్ - 7, ఫార్మ్- 8 అర్జీలకు సంబంధించి అర్జీదారులతో మాట్లాడి ఏ విధమైన డాక్యుమెంట్స్ తీసుకోవాలి కొన్ని సూచనలు సలహాలు అందజేశారు.

ఫీల్డ్‌లో ఏ విధమైన సమస్యలు వచ్చి నప్పుడు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సదరు కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు మరియు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి గెలుపు ఖాయమనే శరత్ అక్రమ అరెస్టు

ఎమ్మెల్యే గొట్టిపాటి రవి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పుల్లారావుతో మాట్లాడుతున్న రవి

చిలకలూరిపేట నియోజకర్గంలో మా జీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉ పాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు గెలుపు ఖాయమైన నేప థ్యంలోనే జగన్ ప్రభుత్వం ఆయన కుమా రుడిని అక్ర మంగా అరెస్టు చేసి వేధింపులకు పాల్పడు తోందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి మండి పడ్డారు. స్థానిక పండరీపురంలోని పులా ్లరావు ఇంటికి శుక్రవారం ఉదయం వెళ్లి ఆయనను పరా మర్శించి.. సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ చిలకలూరిపేటలో ప్రత్తిపాటి గెలుపు ఖాయమని సర్వేల్లో సుస్పష్టంగా తెలిసిందని, ప్రత్తి పాటిని ఏమీ చే యలేక ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసు కున్నారని గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఇటు వంటి సవాళ్లు ఎన్నో చూశామని, భయపడే ప్రసక్తే లేదని అన్నారు. తాను గానీ, తన కుటుంబ సభ్యులు గానీ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. పుల్లారావును నరసరావు్రపేట నియోజకవర్గం టిడిపి నేత నల్లపాటి రాము, నాయకులు కార్య కర్తలు కలిసి తమ మద్దతు ప్రకటించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తాగునీటి చెరువులను సందర్శించిన మునిసిపల్ కమిషనర్

స్థానిక పురపాలక సంఘ పరిధిలోని మంచి నీటిని సరఫరా చేసే చెరువులను శుక్రవారం మునిసిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు సందర్శించారు. పట్టణంలో తాగునీటి పరిస్థితిని పర్యవేక్షించారు. రాబోయే వేసవి దృష్ట్యా తాగు నీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పట్టణ ప్రాంత ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ రమణ పాల్గొన్నారు.

'రా..కదలిరా'ను విజయవంతం చేయండి: టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో దాచేపల్లిలో శనివారం జరిగే 'రా.. కదలిరా' బహిరంగ సభకు టిడిపి-జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజ లందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపు నిచ్చారు. ఈ బహిరంగ సభలో చంద్రబాబు సమక్షంలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డ్ కౌన్సిలర్లు, సర్పంచులు పెద్ద సంఖ్యలో టిడిపిలో చేరనున్నారని చెప్పారు. **ప్రజాశక్తి-మాచర్ల** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సంపద సృష్టించే సత్తా గల నాయకుడు, దేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అని టిడిపి ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు.శనివారం దాచేపల్లిలో జరిగే బహిరంగ సభలో నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. **ప్రజాశక్తి-పెదకూరపాడు:** దాచేపల్లిలో జరిగే సభకు పెదకూరపాడు మండల పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తరలిరావాలని పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రమేష్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.టిడిపి నాయకులు వడ్లమూడి అప్పారావు, సాగర్, అజీముల్లా,సురేష్ పాల్గొన్నారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-మాచర్ల: రాష్ట్రంలో నిర్మా ణాత్మకమైన అభివృద్ధి కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలకు బహిరంగంగానే మద్దతు ఇవ్వాలని ప్రజలను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు కోరారు. పట్టణంలోని 12, 22వ వార్డులలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర సర్వతో ముఖాభి వృద్ధి సాధించేందుకు తెలుగు దేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావటం చారిత్రక అవసరంమని దేశం పార్టీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొప్పునూరు టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం జరిగింది .వైసిపికి చెందిన పలువురు కీలక నాయకులు టిడిపిలో చేరారు.

పూర్తి పన్ను బకాయి చెల్లిస్తే వడ్డీ రాయితీ

మాచర్ల మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణ పరిధిలో ఆస్థి పన్ను, ఖాళీ స్థలాలకు చెందిన పూర్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించి ప్రభుత్వం ప్రకటించిన వడ్డి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పన్ను చెల్లింపుదారులను మున్సిపల్ కమిషనర్ దేవళ్ళ వెంకటదాసు కోరారు. ఈ సందర్భంగా కమీషనర్ వెంకటదాసు మాట్లాడుతూ 2024 మార్చి 31 నాటికి ఉండే పూర్తి బకాయి చెల్లించిన వారికి ఈ అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో అటువంటి బకాయి ఉన్న వారు వెంటనే స్పందించి పూర్తి బకాయిలు చెల్లించి వడ్డి రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టిడిపి నాయకుడు థామస్ మృతి

ప్రజాశక్తి-అచ్చంపేట

మండలంలోని తాళ్లచెరువులో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు , బూత్స్ యూనిట్ ఇంచార్జి రేపూడి థామస్ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారం మేరకు కొమ్మాలపాటి భార్య మాధవి లత అక్కడికి వెళ్లారు. థామస్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు .కుటుంబ సభ్యులను ఓదార్చారు. థామస్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. థామస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో మండల కార్యదర్శి నందిగాం ఆశీర్వాదం, బీసీ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, గాదే చిన్నారెడ్డి, రేపూడు జోజి ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి తెనాలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ బి శేషన్న శుక్రవారం పరిశీలిం చారు. 24 నుంచి 31వ వార్డు వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అలాగే ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, చెంచుపేట శబరి వధాలయం పోలింగ్ కేంద్రాలలోని 52 నుంచి 59 వరకు గల పురపాలక సంఘ ముస్లిం ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ యు పి స్కూల్, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలోని 58, 59, 97 నుంచి 103 వరకు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం తదితర మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏసిపి 2 ఎల్ ఎస్ సుబ్బారావు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

ఆలపాటి పెళ్లికానుక అందజేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి నియోజకవర్గ పరిధిలో మాజి మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందిస్తున్న పెళ్లికానుక ప్రజాదరణ పొందింది. ఈకార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్ కు చెందిన చేబ్రోలు శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతుల కుమార్తె అనూష, కొల్లిపర మండలం గుదిబండివారి పాలెం కు చెందిన అర్జునరావు, రమాదేవి దంపతుల కుమార్తె హేమలత, తెనాలి 28వ వార్డు చెందిన షేక్ సుభాని, నూర్జహాన్ దంపతుల కుమార్తె రిహానాలకు తాళిబొట్టు ఉంగరం అందజేశారు. స్థానిక టిడిపి నాయకులు చీర, సారె ను సంప్రదాయంగా అందించారు.

5వ తేదీ నుండి ప్రైవేటు స్కూల్స్‌లో ఉచిత సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గుంటూరు

ఉచిత విద్యాహక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాలకు సంబంధించి షెడ్యూలు మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను మార్చి 5వ తేదీ నుండి 25వ తేదీలోపు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు సంబంధిత సచివాల యాలు, మండల విద్యావనరుల కేంద్రాలు, పాఠశాలల నుండి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదనపు సమాచారం కోసం మండల విద్యాశాఖ కార్యాలయంలోగానీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోగానీ సంప్రదించాలన్నారు.

రేపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు

ప్రజాశక్తి తెనాలి

ఈనెల 3వ తేదీన జరుగనున్న పల్స్ పోలియో పోస్టర్స్ ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందని, పోలియో రహిత సమాజం కోసం పోలియో చుక్కల కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తుందన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, అసిస్టెంట్ కమిషనర్ అనూష,

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే తదితరులు

మేనేజర్ కె అప్పలరాజు, ఎంహెచ్ఓ డాక్టర్ కె హెలెన్ నిర్మల, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, నాయకులు కె హరీష్, టి రమేష్, ఆరోగ్య సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎ రామచంద్రరావు, విజయ కుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే పొత్తు : ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :పార్టీ సిద్ధాంతాలకు గౌరవానికి భంగం వాటిల్లకుండా పార్టీ శ్రేయస్సు కోరుకునేవాడే నిజమైన నాయకుడని ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రువారం ఏర్పాటు చేసిన ఉమ్మడి టిడిపి, జనసేన అత్యవసర సమావేశంలో జనసేన పార్టీ రాజ కీయ వ్యవహారాల కమిటి ఛైర్మెన్ నాదెండ్ల మనోహర్, జిల్లా టిడిపి ఎంపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ లతో భేటీ అయ్యా రు. రానున్న ఎన్నికల ప్రచారంలో జనసేన పార్టి విజయానికి తమవంతు సహకారం అందించా లని టిడిపి కార్యకర్తలను కోరారు. టిడిపి నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రత్యర్థులు ప్రయోగించే అస్త్రాలకు లోబడ కుండా ఇరు పార్టీల నాయకులు ముందుకు వెళ్లాలన్నారు. చంద్రబాబు నాయుడు విధానాలకు ముగ్ధడునై పార్టీలో సేవలు చేయడానికి వచ్చానని అన్నారు. నాదెండ్ల మనో హర్ మాట్లాడుతూ పార్టీ గెలుపుపై ఆశలుపెట్టుకున్న తెనాలి నియోజకవర్గానికి పూర్వపు స్వర్ణయుగాన్ని తీసుకు వస్తానన్నారు. కార్యక్రమంలో ఇరుపార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరులో టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం పొన్నూరు పట్టణ, మరియు మండల తెలుగుదేశం మరియు జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పొన్నూరు నియోజకవర్గ టిడిపి నాయకులు ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన నాయకులు వి మార్కెండేయబాబు ప్రసంగించారు.

మలినేనిలో వేడుకగా సంస్కృతి-2024

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక పుల్లడిగుంటలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలో సంస్కృతి-2024 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్, స్పోర్ట్స్ వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జేఎన్టీయూ-కె డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్స్ బి.బాలకృష్ణ హాజరయ్యారు. బాలకృష్ణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విద్యా విధానంలో అకడమిక్స్‌తో పాటు క్రీడలకు ఎంతో ప్రోత్సా హం ఇస్తున్నారని, వాటిని వినియోగించు కోవాలన్నారు. పెమసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ టెక్నాలజీ ప్రతిరోజు అభివద్ధి చెందుతుందని, యువత వాటిని ఉపయోగిం చుకుని, ఆలోచనా శక్తి పెంచుకుని దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులోని నైపుణ్యాన్ని పెంపొందించటానికి

పెమ్మసాని చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న మలినేని పెరుమాళ్లు

సంస్కృతి 2024 పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిసు ్తన్నామని చెప్పారు. వివిధ కళాశాలల నుండి దాదాపుగా 4వేల మంది పాల్గొన్నట్లు కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ గోనుగుంట్ల రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమాలో ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు , డీన్‌లు డాక్టర్ పోపూరి రమేష్ బాబు, ప్రొఫెసర్ జంపాని కిషోర్‌బాబు , కో కన్వీనర్లు డాక్టర్ దొమ్మేటి విజయ సారధి, డాక్టర్ హరికష్ణ , డాక్టర్ కందెపు సునీత తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

మున్సిపల్ ఉద్యోగులకు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం పెదకాకానికిలోని శంకర నేత్రాలయవారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు, ఇన్‌డోర్, ఔట్ డోర్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. శిబిరం ఏర్పాటుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆయన కూడా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శంకర నేత్రాలయ సిబ్బందిని అభినంది ంచారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిష నర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఎంహెచ్‌వో డాక్టర్ కె.హెచ్ నిర్మల, అసోసియేషన్ అధ్యక్షులు ఆకురాతి రామ చంద్రరావు, సెక్రటరీ టిఎం కల్యాణ్‌కుమార్, పాల్గొన్నారు.

హయ్యర్‌పేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

రైల్వే కల్వర్టులో మురుగు తొలగింపు

ప్రజాశక్తి-తెనాలి :సుదీర్ఘకాలంగా క్లీనింగ్‌కు నోచుకోని రైల్వే కల్వర్టును నాలుగు రోజులు శ్రమించి మురుగు తొలగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక దీనికి చొరవచూపారు. పట్టణంలోని 32వ వార్డు యడ్ల లింగయ్య కాలనీకి వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ దిగువ కల్వర్టు ఉంది. ట్రాక్ వేసిన తరువాత క్రమంలో ఈ కల్వర్టును క్లీనింగ్ చేసిన దాఖలాలు లేవని అధికారులు చెబుతున్నారు. కల్వర్టు కింద మురుగు ఎండిపోయి, వ్యర్థాలు చేరి, నీటి పారుదల పూర్తిగా నిలిచిపోయింది. స్థానికుల ద్వారా సమస్యను గుర్తించిన చైర్‌పర్సన్ గతనెల 27న రైల్వే అధికారుల అనుమతి కోరారు. వారి అనుమతి మేరకు అదే రోజును మురుగు తొలగింపు ప్రారంభించి శుక్రవారం పూర్తి చేశారు. దీర్ఘకాలిక సమస్యకు మోక్షం లభించటంతో ఆప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక ఐతానగర్ హయ్యర్‌పేట రెండో వార్డు పరిధిలో ముగురు కాలువల్లో సీల్ట్ తీయించారు. ఆమెవెంట శానిటటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, ఏఈ రాజాఫణీంద్ర, వార్డు శానిటరి సెక్రటరీలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పన వేగవంతం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుందని, సోమవారానికి పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని సూపర్వైజరి అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, విద్యుత్ వంటి మౌలిక వసతుల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో వద్ధులకు, వికలాంగులకు, వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్‌ఓలు పరిశీలించి, కేంద్రాల్లో ర్యాంప్‌లు, విద్యుత్ వంటి వసతుల ఏర్పాటు చేయించాలన్నారు. కేంద్రాల్లో త్రాగునీటి సౌకర్యం పరిశీలించాలని, మరుగుదొడ్లకు ఏమైనా మరమత్తులు చేపట్టాల్సి ఉంటే వెంటనే పూర్తి చేసేలా సూచించాలన్నారు.

దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

వర్సిటీలో జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ మరియు సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు వర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ సదస్సుకు వర్సిటీ సోషియాలజీ మరియు సోషల్ వర్క్ విభాగధిపతి, సదస్సు డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులు, పరిశోధకులు ఏర్పాటు చేసి కెరీర్‌గా ఎంచుకోవాలన్నారు. సేవా దృక్పథంతో ఎన్జీవోల కృషి అభినందనీయమని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా దేశ అభివద్ధికి ఆటంకంగా ఉన్న పేదరికం, ఆకలి చావులు మెరుగైన విద్య వైద్య సదు పాయాలు లేకపోవడం, కనీస నివాసయోగ్యమైన వసతులు లేకపోవడం వంటి సామాజిక రుగ్మతలు పై నిరంతరం స్వచ్ఛంద సేవ సంస్థలు సేవా యుద్ధాన్ని కొనసాగిస్తు న్నాయని చెప్పారు. జాతీయస్థాయిలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థల అందిస్తున్న సేవలను గురించి విపులీకరించారు. గతంలో తాను స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రజలకు విద్యార్థులకు అందించిన సేవలను గుర్తు చేశారు. ఏ.పీ. విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ అసిస్టెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం ఏ కుమార రాజా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా స్వచ్ఛంద సంస్థలు నిలిచాయన్నారు. విభిన్న ప్రతిభావంతులు మానసిక ధృఢత్వం కోల్పోయిన వారికి సేవలు అందించడం కేవలం ఎన్జీవోలకు మాత్రమే సాధ్యమని తెలిపారు. నేటి సమాజంలో యువతను పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారి నుండి యువతను రక్షించడంలో ప్రముఖ పాత్ర స్వచ్ఛంద

సంస్థలదే అన్నారు. తమిళనాడు కోయంబత్తూర్ భారతీయార్ వర్సిటీకి చెందిన ఆచార్య సి వెంకటాచలం మాట్లాడుతూ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసిన కోవిడ్ మహమ్మారి నీ సమర్థవంతంగా ఎదుర్కోవడంలో స్వచ్ఛంద సంస్థల కృషి గొప్పదన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాంకేతిక యుగంలో అసమానతలు రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక గోవా పంజాబ్ తమిళనాడు ఒడిస్సా తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి మొత్తం 160 పైగా పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. అనంతరం జాతీయ సదస్సు సావనీరును అతిథులు ఆవిష్కరించారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ స్వరూప రాణి, సోషల్ సైన్స్ డీన్ ఆచార్య ఎం త్రిమూర్తి రావు, ఆచార్య కె. ధనలక్ష్మి, ఆచార్య సరస్వతి రాజ్ అయ్యర్, ఆచార్య సి ఎస్ ఎన్ రాజు, ఎస్ కే డి వర్సిటీ ఆచార్య జీవీ రమణ లు మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య కే మధుబాబు, ఆచార్య అశోక్ కుమార్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ దివ్య తేజోమూర్తి, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

జిఎంసి పరిధిలో పరీక్షించి తాగునీరు సరఫరా

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్ల మీదుగా వెళ్లే తాగునీటి పైపులైన్లను పక్కకు మార్చటంతో పాటు, లీకులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేలా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డికి తెలిపారు. శుక్రవారం జవహర్‌రెడ్డి పురపాలకశాఖ అధికారులతో కలసి పట్టణాల్లో అంటువ్యాధులు ప్రభలకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగర కమిషనర్ కీర్తీ చేకూరి, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో సరఫరా అవుతున్న మంచినీటిని పూర్తి స్థాయిలో అధికారులు పరిక్షించి సరఫరా చేయటం జరుగుతుందన్నారు. ప్రజలు వాంతులు, విరోచనాల లక్షణాలతో అస్వస్థతకు గురి అవుతున్న ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి పెట్టి మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిఎంసి ఎస్ఈ సుందరరామిరెడ్డి , జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, ఆహర తనిఖీ అధికారి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

వర్సిటీలో సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్ కళాశాల సాఫ్ట్ బాల్ టోర్నమెంటు శుక్రవారం ప్రారంభమైంది. ఈ పోటీలలో ఆరు అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ముప్పాళ్ళ లోని ధనలక్ష్మి వ్యాయామ విద్య కళాశాల, చిలకలూరిపేట లోని సీఆర్ కళాశాల, చౌడవరంలోని ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాల, పిడుగురాళ్లలోని ఎంఎల్ అండ్ ఎస్ కళాశాలలు అర్హత సాధించాయి. ఈ పోటీలను వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పి. జాన్సన్, యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి .సూర్యనారాయణ, సెలెక్టన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి. గౌరీ శంకర్, టెక్నికల్ అఫీషియల్స్ ఎం. బద్రీనారాయణ , ఎం. అమర్నాథ్ , పి. సురేష్ , వి సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ మెథడాలజీ వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మాట్లాడుతున్న విసి

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ సదరన్ రీజియన్ విభాగము సౌజన్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ వర్క్ షాప్ ను ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన అంశం పరిశీలనలో పరిశోధకులు, పరిశోధక డైరెక్టర్ల, రీసెర్చ్ సూపర్వైజర్స్‌ల మాననీయ సంభందాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. పరిశోధనా అంశాలను విపులముగా చదవటం, అవగాహన చేసుకొన్న తర్వాత వాటిని తిరిగి వ్రాసుకోవడం ద్వారా ప్లాగరిజం వంటి వాటిని నుంచి బయటపడవచ్చు అని తెలియజేశారు. వర్క్ షాప్ డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కి ఏదైనా ఒక అంశం పరిశోధన గావించడానికి తీసుకోవలసిన విధి విధానాలను ఈ వర్క్ షాప్ లో తెలియజేస్తారన్నారు. ఐసిఎస్ఎస్ఆర్ యస్ఆర్ సి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, కన్సల్టెంట్ డాక్టర్ జాకోబ్ ఈ వర్క్ షాప్ ప్రారంభోత్సవానికి విశిష్ఠ అతిథులుగా పాల్గొన్నారు. 5 రాష్ట్రాల నుంచి 30 పైగా ప్రతినిధులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొంటా రని, వారికి అన్ని అంశములు మీద అవగాహన కల్పించడానికి రిసోర్స్ పర్సన్స్ ఎంపిక చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ వర్క్ షాప్ కు కో-డైరెక్టర్ గా ప్రొఫెసర్ ఎల్ ఉదయ కుమార్, అనుసంధాన కర్తగా డాక్టర్ చుండి ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జి వి ఎస్ ఆర్ ఆంజనేయులు ఈ వర్క్ షాప్ కు సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

ఎఫట్రానిక్స్‌లో కళ్లం విద్యార్థికి ఉద్యోగం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో బి.టెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ విద్యార్థి నాగార్జున ఈదర ఎఫట్రానిక్స్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉదోగానికి ఎంపికయ్యాడు. ఈ విద్యార్థికి సంవత్సరానికి రూ.5.30 లక్షల వార్షిక వేతనం అందుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.యల్. మాధవరావు నాగార్జునను అభినందించారు.

నాగార్జునను అభినందిస్తున్న కాలేజి డైరెక్టర్, తదితరులు

యునికో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు :చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి నిర్మాణం, కొనుగోలు కోసం తక్కువ వడ్డీ రేట్లతో యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ రుణాలు అందిస్తుందని యూనికో సంస్థ స్టేట్ హెడ్ కొండవీటి ప్రదీప్ తెలిపారు. నగరంలోని అరండల్‌పేట 12/1లో యునికో హైసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గుంటూరు శాఖను శుక్రవారం ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కె.అరుణ్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఎం.మణికందన్ ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి.ఏడుకొండలు, క్రెడిట్, మార్కెటింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శాఖను ప్రారంభిస్తున్న అరుణ్ తదితరులు

జిల్లాలో 37,064 మందికి విద్యాదీవెన

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో జగనన్న విద్యాదీవెన దీవెన కింద 31.28 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.శుక్రవారం కృష్ణాజిల్లా పామర్రు నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అక్టోబర్- డిసెంబర్ 2023 త్రైమాసిక ఫీజు విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాలో జమ చేసే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర విభిన్నప్రతిభావంతుల సహాయ కార్పోరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, రాష్ట్ర కష్ణబలిజ, పూసల కార్పోరేషన్ చైర్‌పర్సన్ కోలా భవానీమణికంఠ, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు, విద్యార్ధులతో కలసి వీక్షించారు. అనంరతం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 37,064 మంది లబ్దిదారులకు రూ.31.28 కోట్లు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్దిదారులకు మెగా చెక్కును అందచేశారు.

మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

అంకుర పరిశ్రమలపై ఆర్‌విఆర్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు : ప్రతి విద్యార్థి అంకుర పరిశ్రమల స్థాపన దిశగా ఆలోచనలు చేస్తూ, అందుకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలని కళాశాలలో ఉన్న ఇంక్యూటేబర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రా యూని వర్సిటీ ఇంక్యుబేటర్ కౌన్సిల్ సిఇఒ అండ్ డైరెక్టర్ రవి ఈశ్వరప్ప అన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శుక్రవారం కళాశాల ఈడి సెల్ అండ్ ఐఐసి సెల్ ఆధ్వర్యంలో కళాశాల ఆర్‌జె ఈ-నెస్ట్ సహకారంతో రెండు విభాగాలుగా వర్క్‌షాప్‌లు నిర్వహించారు. 'ఎచీవింగ్ ప్రాబ్లమ్-సొల్యూషన్ ఫిట్ అండ్ ప్రొడక్ట్-మార్కెట్ ఫిట్ ' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌నకు రవి ఈశ్వరప్ప, అలాగే 'ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్, ఆటిట్యూడ్ అండ్ బిహేవియర్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ మేనేజర్ దినకర్ వాడపల్లి అతిథులగా హాజరయ్యారు. నూతన అంకుర పరిశ్రమల స్థాపనకు, అవి విజయపథంలో నడపటానికి చేపట్టాల్సిన చర్యలను, అందులోని వివిధ దశలను వివరించారు. పరిశ్రమల్లో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించే సులభతర మార్గాలను విద్యార్ధులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కళాశాలను స్టార్ట్ అప్ హబ్‌గా నెలకొల్పటమే తమ లక్ష్యమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవి ఈశ్వరప్ప

నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధి సాకారం

ప్రజాశక్తి-గుంటూరు : నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత, స్టార్టప్‌లను పెంపొందించటం వల్ల ఆర్థిక వృద్ధి, ఉద్యోగ కల్పన, సాంకేతిక పురోగతిని పెంపొందించుకోవచ్చని మధ్య ప్రదేశ్‌లోని మంగళ్యాతాన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కెఎస్ఆర్ సాంబశివరావు అన్నారు. లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో అధ్యాపకులకు స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్సింగ్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్టార్టప్స్ అనే అంశంపై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యు కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ ఆర్‌శివప్రసాద్, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు పాల్గొన్నారు. సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉన్నత, సాంకేతిక విద్యాసంస్థల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు బయటకు వస్తున్నారని, అయితే వారు పరిశ్రమలు, ఆర్‌అండ్‌డి సంస్థలు, ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాల అవసరాలు తీర్చలేకపోతున్నారని అన్నారు. కావున ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ సాంబశివరావును ఘనంగా సన్మానించారు.

సాంబశివరావును సత్కరిస్తున్న వైవి ఆంజనేయులు, తదితరులు

సామాజిక సేవలో యువత ముందుండాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి జాతీయ సేవాపథకం యూనిట్-2 వారు కళాశాల దత్తత గ్రామమైన అడవితక్కెల్లపాడు గ్రామంలో ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. వారంరోజులపాటు వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. డి. రాహుల్ తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. డి.రవిశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ నాగేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిబిరాలలో పాల్గొనడం ద్వారా సమాజంలో ప్రజల జీవన స్థితిగతులు తెలుస్తాయని, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఈ సందర్భంగా అడవి తక్కెలపాడు గ్రామంలో, పాఠశాల ఆవరణంలో పిచ్చి చెట్లను తొలగించి, మంచి మొక్కలను నాటారు. గ్రామ వీధుల్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో పి.జి. కోర్సుల డైరెక్టర్ యస్ఆర్‌కె ప్రసాద్, యమ్‌వియస్ కోటేశ్వరరావు మోమోరియల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ యన్.తాండవకృష్ణ, ఎల్ఎస్.భారవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాహుల్

వర్సిటీలో స్వయం ఉపాధిపై మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మహిళా అభ్యుదయం పై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి సారించిందని విశ్వ విద్యాలయ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం నుండి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలోని కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగము (సీఎస్ఆర్) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా స్వయంగా జీవన ప్రమాణాలను మెరుగు పరచుకుంటూ నేటి సమాజ జీవనశైలికి అనుగుణంగా పరిపూర్ణమైన పర్యావరణహితమైన జ్యూట్ సంచుల తయారీలో శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పర్యావరణహితమైన కార్యక్రమాల రూపకల్పన ద్వారా సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం విశ్వవిద్యాలయంలో వైవిధ్యమైన విశేషమైన పాత్రను పోషిస్తున్నదని విభాగం సభ్యులను అభినందించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగానే కాక రాష్ట్రంలో సైతం ఈ విశ్వవిద్యాలయ సేవలను వినియోగించుకొని మహిళలు తాము ఎదుగుతూ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు సైతం పర్యావరణహితమైన సంచులను అందించే విధంగా దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ సమన్వయకర్త ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, కార్యక్రమ విధి నిర్వహణ అధికారి డాక్టర్ ఎమ్ వెంకటరమణ, శిక్షకురాలు డి.ఆమని, సిఎస్ఆర్ విభాగ సిబ్బంది వై.సాయి లీల,ఎన్ శ్యామల ,తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణ పై ఆసక్తి కలిగిన 50మందికి పైగా పరిసర ప్రాంతవాసులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.